క్లుప్తంగా

సీసీరోడ్డు నిర్మాణానికి దాతల సాయం



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయం వద్దకు నిర్మిస్తున్న సీసీరోడ్డుకు దాతలు సహకారం అందిస్తున్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి 600 ఎస్‌ఎఫ్‌టీ కంకరను విరాళంగా అందజేశారు. అదేవిధంగా అడ్డాకులకు బీఆర్‌ఎస్‌ నాయకుడు బొక్కలపల్లి తిరుపతిరెడ్డి 100 బస్తాల సిమెంట్‌, కొమిరెడ్డిపల్లికి చెందిన మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య 50 బస్తాల సిమెంట్‌, గాజులపేటకు చెందిన సత్యనారాయణ 50 బస్తాల సిమెంట్‌ను విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నరేందర్‌, జెడ్పీ మాజీ కోఆప్షన్‌ మహమూద్‌, కొండయ్య, మశ్చందర్‌నాథ్‌, రాజేష్‌గౌడ్‌, అస్కని నర్సింహ, ఆలూరి గోపి, నగేష్‌, వెంకటాంపల్లి రాజు, సురేష్‌ తదితరులు ఉన్నారు.

ముగిసిన తొలి విడత శిక్షణ



జడ్చర్ల టౌన్‌: పట్టణంలోని అంబేడ్కర్‌ కళాభవన్‌లో ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు మూడురోజులుగా ఇస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. క్లస్టర్‌ పరిధిలోని జడ్చర్ల, బాలానగర్‌, రాజాపూర్‌, మిడ్జిల్‌ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు 105మంది శిక్షణకు హాజరయ్యారు. మిగిలిన టీచర్లకు గురువారం నుంచి శిక్షణ ప్రారంభం కానుంది. ముగింపు సందర్భంగా సీడీపీఓ మెహరున్నీసా బేగం మాట్లాడారు. విద్యాదీపికలను అందజేశారు. శిక్షణను ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సందర్శించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. శిక్షణకు వచ్చేవారు కూర్చునేందుకు ఇబ్బందిగా ఉందని ఆయన దృష్టికి తీసుకురాగా కుర్చీలు అద్దెకు తెచ్చుకునేందుకు రూ.10వేలు అందజేశారు.

మైనార్టీలకు గుర్తింపు ఘనత కేసీఆర్‌దే



జడ్చర్ల టౌన్‌: రాష్ట్రంలో మైనార్టీలకు తగిన గుర్తింపు తీసుకువచ్చి, చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని జెడ్పీవైస్‌ చైర్మన్‌ కోడ్గల్‌ యాదయ్య అన్నారు. బుధవారం దేవునిగుట్టతండా వద్ద కస్తూర్బాలో వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఇన్‌చార్జి ఎస్‌ఓ ఫరియాజకియా, కార్యదర్శి ఉదయ్‌కుమార్‌, మాజీ సర్పంచ్‌ రాములు, ముడా డైరెక్టర్‌ ఇంతియాజ్‌ పాల్గొన్నారు.

హాస్టల్‌ పరిశీలన

గండేడ్‌: జిల్లా బీసీ వెల్ఫేర్‌ అధికారి ఇందిర బుధవారం మండల కేంద్రంలోని బాలుర బీసీ వసతిగృహాన్ని పరిశీలించారు. వివిధ అంశాలపై అడిగి తెలుసుకున్నారు. వార్డెన్‌ కృష్ణకు వివిధ సౌకర్యాలపై సూచనలు చేశారు. వసతి గృహం ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

బస్‌ షెల్టర్‌ ప్రారంభం

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): ప్రతి ఒక్కరు సామాజికసేవలో భాగస్వాములు కావాలని మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ చెరుకుపల్లి రాజేష్‌ అన్నారు. వాసవీ, వనితా క్లబ్‌ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మధురానగర్‌ బస్‌షెల్టర్‌ను నిర్మించగా బుధవారం ఆయన ప్రారంభించారు. వాసవీ క్లబ్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌, క్లబ్‌ ఇంటర్నేషనల్‌ గవర్నర్‌ జగదీష్‌గుప్తా, కోశాధికారి భీమ్‌, వనిత క్లబ్‌ అధ్యక్షులు సువర్ణ, కార్యదర్శి ఉమ, కోశాధికారి శిరీషా పాల్గొన్నారు.

నేడు వన మహోత్సవానికి శ్రీకారం

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఎంవీఎస్‌ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం ఉదయం తొమ్మిది గంటలకు వన మహోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు స్థానిక మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు చైర్మన్‌ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి : ఎమ్మెల్సీ

నవాబుపేట: రాజకీయ వైషమ్యాలు, విమర్శలు మాని అభివృద్ధిపై సీఎం దృష్టి పెట్టాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఎం సొంత జిల్లాలో బీఆర్‌ఎస్‌ను గెలిపించిన నాయకుల పట్టుదల అభినందనీయమన్నారు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసేలా సీఎం పాలన సాగుతుందని విమర్శించారు. అనంతరం ఆయనను ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్‌ నాయకులు సన్మానించారు. జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ అనంతయ్య, వైస్‌ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సింగిల్‌ విండోచైర్మన్‌ నర్సింహులు, కోఆప్షన్‌ తాహెర్‌, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ అవకాశం గొప్పవరం



చిన్నచింతకుంటలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం రావడం గొప్ప వరమని ఎమ్మెల్యే ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై వారిని ఘనంగా సత్కరించారు. 20 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. గ్రామంలో హైమాక్స్‌ లైట్లను ప్రారంభించారు. ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ వట్టెం రాజేశ్వరి, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్‌: మండలాల అభివృద్ధిలో ఎంపీపీలే కీలకమని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీల వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు నవీన్‌ గౌడ్‌ తదితరులతో కలిసి సత్కరించారు. ఏడాది లోగా పేరూర్‌ లిఫ్టు పూర్తి చేయడంతో పాటు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు మెయిన్‌ కెనాల్‌ భూసేకరణకు ఇరిగేషన్‌ అధికారులు కసరత్తు చేస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా 36 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. తహసీల్దార్‌ పి. రాజు, డీటీ గీత, ఎంపీడీఓ ప్రభాకర్‌ చారి, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్‌ నర్సింహారెడ్డి, మాజీ డీసీసీ ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండల పరిషత్‌ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీ రాధిక, ఎంపీటీసీలను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సూపరింటెండెంట్‌ శివప్రసాద్‌ తదితరులు ఉన్నారు. అదేవిధంగా పెద్దమునుగల్‌ఛేడ్‌లో జెడ్పీటీసీ సభ్యుడు ఎన్‌.రాజశేఖర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ ఎంపీటీసీలను సన్మానించారు.

దేవరకద్ర: మండల పరిషత్‌ కార్యాలయంలో పదవీ కాలం ముగిసిన ప్రజాప్రతినిధులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంపీపీ రమాదేవి, వైస్‌ ఎంపీపీ సుజాత తదితరులను మండల పరిషత్‌ సిబ్బందితో పాటు వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల నాయకులు సత్కరించారు. ఎంపీటీసీ సభ్యులు యజ్ఞభూపాల్‌రెడ్డి, కిష్టన్న, తిరుపతయ్య, ఆంజనేయులు, హన్మంతరెడ్డి, సుగుణమ్మ, లక్ష్మీదేవమ్మ, నారాయణ, పార్వతమ్మ తదితరులు ఉన్నారు.



దేవరకద్రలో..

టార్గెట్‌ పూర్తి చేద్దాం



రాజాపూర్‌లో ఎజెండా చదువుతున్న వ్యవసాయ అధికారి నరేందర్‌

రాజాపూర్‌: వనాలు ఉంటేనే మానవాళికి మనుగడ అని..మండలంలో ప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమంలో ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసుకుందామని ఎంపీపీ సుశీల పేర్కొన్నారు. బుధవారం ఆమె అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి నరేందర్‌ ఎజెండా చదివి వినిపించారు. ఎంపీడీఓ మశ్చందర్‌, తహసీల్దార్‌ విద్యాసాగర్‌రెడ్డి, డీసీఎంఎస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని ప్రజాప్రతినిధులు నాయకులు ఘనంగా సన్మానించారు.

అధికారం లేని పదవులు వద్దు



సన్మానం పొందిన సభ్యులు

నవాబుపేట: ఎలాంటి అధికారాలు లేని ఎంపీటీసీ పదవులు వ్యర్థమని.. వారు కేవలం ఎన్నికైన నాడు సంబురాలు చేసుకుని ఎంపీపీలను ఎన్నుకునే వరకే ఉండాల్సిన పరిస్థితి ఉందని.. గ్రామాల్లో ఎలాంటి అధికారం ఉండదని ఎంపీపీ అనంతయ్య అన్నారు. బుధవారం ఆఖరి సర్వసభ్య సమావేశంలో భావోద్వేగంతో ప్రసంగించారు. అనంతరం సభ్యులు తమ 5 సంవత్సరాల పాలనపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అధికారులు నివేదికలు చదివి వినిపించారు. అదేవిధంగా జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్‌ నర్సింహులు, వైస్‌ఎంపీపీ సంతోష్‌రెడ్డి, కోఆప్షన్‌ తాహేర్‌ తదితరులు ఉన్నారు.

‘పాపెలా ఉందమ్మా’

చంటిబిడ్డ తల్లిని ఆరా తీసిన కలెక్టర్‌



నవాబుపేట పీహెచ్‌సీలో చంటి బిడ్డతల్లితో మాట్లాడుతున్న కలెక్టర్‌ విజయేందిర

నవాబుపేట: ‘ఏమ్మా.. పాపెలా ఉంది. ఆస్పత్రిలో సౌకర్యాలు బాగున్నాయా?, నార్మలా? సిజేరియన్‌ చేశారా?’ అంటూ ప్రాథమిక ఆస్పత్రి ఆవరణలో ఓ చంటిబిడ్డ తల్లిని కలెక్టర్‌ విజయేందిర ఆరా తీశారు. కాగా ఆమె ఎవరో అనుకుని నార్మల్‌గానే బుధవారం సూదికోసం వచ్చామమ్మా అంటూ బిడ్డ తల్లి కలెక్టర్‌కు సమాధానమిచ్చింది. ఈ ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఈ మేరకు కలెక్టర్‌ విజయేందిర ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఇప్పటివరకు అత్యధిక ప్రసవాల రికార్డు నమోదు చేసుకోవడంపై సిబ్బందిని అభినందించారు. మరింత కష్టపడి పనిచేయాలని సూచించారు. అనంతరం తహసీల్దార్‌ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ధరణి పెండింగ్‌ సమస్యలు పూర్తి చేయాలని సూచించారు. కాగా గతంలో 4 వందల సమస్యలు పెండింగ్‌లో ఉండగా.. తాజాగా వాటిలో 40 మాత్రమే పెండింగ్‌లో ఉండడంతో సిబ్బందిని అభినందించారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన వారిని సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్‌ నాన్యనాయక్‌, మండల వైద్యాధికారి డాక్టర్‌ నరేష్‌చంద్ర తదితరులు ఉన్నారు.

మహమ్మదాబాద్‌: మండల తహసీల్దార్‌ కార్యాలయాన్ని కలెక్టర్‌ విజయేందిర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తుల సవరణపై ఆరా తీశారు. ధరణి దరఖాస్తులపై సమీక్షించారు. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పక్కనే ఉన్న ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

రక్తదానం చేయడం సామాజిక బాధ్యత



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని పీయూ రిజిస్ట్రార్‌ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం యూనివర్సిటీలోని పీజీ కళాశాలలో మెగా రక్తదాన, హెల్త్‌క్యాంప్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తం ఇస్తే వారికి ప్రాణదానం చేసిన వారమవుతామని తెలిపారు. రక్తదానంపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండడం వల్ల రక్తకొరత ఏర్పడకుండా ఉంటుందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌ చంద్రకిరణ్‌ మాట్లాడుతూ విద్యార్థులకు చర్మ, కంటి, ఎముకలు, హృద్రోగ సమస్యలను పరీక్షించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామని, సమస్యలు ఉన్న వారికి వైద్యుల సూచనలతో పాటు మందులు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులోభాగంగా 100 మంది అధ్యాపకులు, 70 మంది నాన్‌టీచింగ్‌ సిబ్బంది, 500లకు పైగా విద్యార్థులు పరీక్షలు చేయించుకున్నారు. 51 మందికిపైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ కృష్ణయ్య, జైపాల్‌రెడ్డి, నూర్‌జహాన్‌, శాంతిప్రియ, గాలెన్న, పర్వతాలు, ఎస్వీఎస్‌ సిబ్బంది బస్వరాజు, సాయి, యచేంద్ర, దివ్య, నిఖిల్‌, శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీ అయినా రిలీవ్‌ చేయలే!

మిడ్జిల్‌: మండల పరిధిలో వివిధ పాఠశాలల నుంచి బదిలీ అయిన టీచర్లు ఇతర ప్రాంతాల నుంచి కొత్తవారు వచ్చి చేరకపోవడంతో అక్కడే ఉండవలసిన పరిస్థితి నెలకొంది. మండలంలో మొత్తం 23 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 4 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలో 68 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా 31 మంది బదిలీ అయ్యారు. బుధవారం వరకు కొత్త వారు 20 మంది జాయినింగ్‌ రిపోర్టు చేయగా, 21 మందిని ఇక్కడి నుంచి రిలీవ్‌ చేశారు. ఇంకా 11 మంది స్థానాలలో ఇతర ఉపాధ్యాయులు రావాల్సి ఉన్నా ఇప్పటికీ రిపోర్టు చేయలేదు. దీంతో పాఠశాలలు మూత పడతాయనే ఉద్దేశంతో అధికారులు ఇక్కడి వారిని రిలీవ్‌ చేయడం లేదు. ఉన్నత అధికారుల ఆదేశంతో వారు తాత్కాలికంగా ఇక్కడే ఉండిపోవలసి వస్తోంది. ఇంకా నాలుగు పాఠశాలల్లో ఎవరు రాకపోవడంతో ఖాళీలు ఏర్పాడ్డాయి. విషయంపై ఎంఈఓ మంజులాదేవిని వివరణ కోరాగా పాఠశాలలు మూత పడవద్దనే ఉద్దేశంతో ఆపినట్లు వివరించారు. ఇక్కడికి బదిలీ అయిన వారు వచ్చి చేరితేనే.. ఇక్కడి వారిని పంపించేందుకు వీలుంటుందన్నారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు తాము నడుచుకుంటామని వివరించారు.

రీటెండర్‌ నిర్వహించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న యువకులు

మహమ్మదాబాద్‌: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న దుకాణ సముదాయానికి సంబంధించి రీటెండర్‌ నిర్వహించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు హెచ్‌ఎం పాండు రంగారెడ్డికి వినతిపత్రం అందించారు. కొత్తవారికి అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వేణుగౌడ్‌, కేశవులు, వెంకటయ్యగౌడ్‌, నర్సింలు, అఫ్సర్‌, ఖాసీం, నాగయ్య తదితరులు ఉన్నారు.

జితేందర్‌రెడ్డికి అభినందన

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టి జిల్లా కేంద్రానికి వచ్చిన ఏపీ జితేందర్‌రెడ్డిని బుధవారం పాలమూరు రెడ్డి సేవా సమితి ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూలబొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జి.వెంకట్రాంరెడ్డి, ప్రచార కార్యదర్శి ఎన్‌.సురేందర్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: మహిళల అభ్యున్నతే కాంగ్రెస్‌ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో క్యాంపు కార్యాలయంలో బుధవారం హన్వాడ మండలానికి చెందిన 58 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కులను అందజేశారు. పథకాల కోసం దళారులను ఆశ్రయించవద్దన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వంలో ఎక్కడా కమీషన్ల సంస్కృతి లేదని, ఏ సంక్షేమ పథకానికి చిల్లిగవ్వ ఏ అధికారికి, నాయకుడికి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. తహసీల్దార్‌ కిష్ట్యానాయక్‌, ఎంపీటీసీ యాదయ్య, కాంగ్రెస్‌ అధ్యక్షుడు మహేందర్‌, డీసీసీ కార్యదర్శి కృష్ణయ్య, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నవనీత, లింగంనాయక్‌ పాల్గొన్నారు.

విద్యపై దృష్టి సారించాలి

కోయిల్‌కొండ: బాలబాలికలు, యువత చదువుపై దృష్టిపెట్టి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎస్‌ఐ శ్రీకాంత్‌ సూచించారు. బుధవారం కొత్లాబాద్‌ ఉన్నత పాఠశాలలో సురక్ష పోలీసు కళాజాతా ఆధ్వర్యంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు, సామాజిక మాధ్యమాలు, మొబైల్‌ఫోన్లు వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. హెచ్‌ఎం రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా విద్యుత్‌ స్తంభం



జడ్చర్ల: స్థానిక గౌరీ శంకర్‌ కాలనీ ముఖ ద్వారం వద్ద విద్యుత్‌ స్తంభం ప్రమాదభరితంగా మారింది. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో ఓ కారు అతివేగంగా వచ్చి స్తంభాన్ని ఢీకొట్టడంతో అడుగుభాగంలో విరిగిపోయింది. కేవలం రెండు చువ్వల బలంతో నిలబడి ఉంది. ఏమాత్రం గాలులు వీచినా స్తంభం నేలకూలి ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జడ్చర్ల: కావేరమ్మపేట వద్ద మంగళవారం రాత్రి జాతీయరహదారిని దాటుతున్న తిమ్మరాజు(38)ను హైదరాబాద్‌ వైపు నుంచి కర్నూల్‌ వైపు వెళ్తున్న కంటెయినర్‌ వేగంగా ఢీ కొట్టింది. ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడి చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి భార్య కుర్మమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోకబాబు వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం



డాక్టర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆస్పత్రిలో విద్యుత్‌సరఫరా తదితర సమస్యలపై వార్తా కథనాలు వచ్చిన నేపథ్యంలో బుధవారం తనిఖీ చేశారు. విద్యుత్‌ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలో డాక్టర్లు, తదితర సిబ్బంది నియామకానికి సంబంధించి సంబంధిత మంత్రి దామోదర రాజనర్సింహతో మాట్లాడుతానన్నారు. అదేవిధంగా మిషన్‌ భగీరథ నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని వవరించారు. ఆస్పత్రి వరకు నేరుగా రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపడుతామని వివరించారు. ఇసుక, మట్టి తరలింపునకు పాల్పడుతున్న వారిని ఎట్టి పరిస్థితులలోను ఉపేక్షించబోమని తెలిపారు. వచ్చేవారంలో జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సమస్యలను సమీక్షించనున్నారని పేర్కొన్నారు. ఆ స్పత్రి సూపరింటెండెంట్‌ సోమశేఖర్‌ పాల్గొన్నారు.

రాజాపూర్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. బాలానగర్‌ మండలంలోని మన్నెగూడ, పెద్దబాయితండాలలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను బుధవారం ప్రారంభించారు. చెన్నంగులగడ్డ తండాలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. తహసీల్దార్‌ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ విజయకుమారి, ఎంపీపీ కమల, నాయకులు శంకర్‌నాయక్‌, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రామ్‌ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్సే

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: రాష్ట్రంలో నిరుద్యోగుల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్‌ ప్రభుత్వమేనని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్‌ అఖ్తర్‌ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం నిరుద్యోగుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. అందుకే ఎన్నికల్లో ఓడిపోయిందన్నారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో 28,942 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు వివరించారు. రెండు వారాల్లో జాబ్‌ క్యాలెండర్‌ విడుదలవుతుందని పేర్కొన్నారు. సీఎం మన జిల్లా బిడ్డ అని, ఇక్కడి ప్రాంతాన్ని ఎడ్యుకేషన్‌, ఎంప్లాయిమెంట్‌ హబ్‌గా మార్చడానికి కృతనిశ్చయంతో ఉన్నట్లు వివరించారు. మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ షబ్బీర్‌ అహ్మద్‌, డీసీసీ మీడియా సెల్‌ కన్వీనర్‌ సీజే బెనహర్‌, పట్టణ కాంగ్రెస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ అజ్మత్‌అలీ, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అవేజ్‌ అహ్మద్‌, మాజీ కౌన్సిలర్‌ బాలస్వామి పాల్గొన్నారు.

సూచనల మేరకే రైతు భరోసా అమలు



మాట్లాడుతున్న డీసీఓ పద్మజ

దేవరకద్ర: రైతులు ఇచ్చే అభిప్రాయాలు, సూచనల మేరకు రైతు భరోసా ఎన్ని ఎకరాల వరకు అమలు చేయాలన్న విషయంపై ప్రభుత్వం తీసుకుంటుందని.. ఈ నేపథ్యంలోనే అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి పద్మజ తెలిపారు. బుధవారం దేవరకద్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో రైతుభరోసాపై అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో సింగిల్‌ విండో అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి రాజేందర్‌ అగర్వాల్‌, డైరెక్టర్‌లు ఎక్బాల్‌పాషా, కృష్ణగోపాల్‌, నారాయణరెడ్డి, కొండారెడ్డి, జైపాల్‌రెడ్డి, శంకర్‌, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో బుధవారం రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్‌ హాజరై అభిప్రాయాలు సేకరించారు. మండల అధికారి రాజేష్‌ఖన్న, సింగిల్‌ విండో అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి

జడ్చర్ల: సైబర్‌ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో సైబర్‌ నేరాలు, జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతాలు, తదితరాలకు సంబంధించిన ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. స్థానిక సీఐ ఆదిరెడ్డి, సైబర్‌క్రైమ్‌ సీఐ గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: సైబర్‌ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవరకద్ర ఎస్‌ఐ నాగన్న కోరారు. బుధవారం మండలంలోని గూరకొండలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి



కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌ స్టేషన్‌ను బుధవారం డీఎస్పీ వెంకటేశ్వర్లు సందర్శించారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని ఆదేశించారు. మండలంలోని అయ్యవారిపల్లి కిడ్నాప్‌ కేసులో విచారణ చేపట్టారు. ధన్వాడకి చెందిన చెందిన గాదెపుల్లప్ప, కావాలి శంకర్‌ కిడ్నాప్‌కు గురయ్యారని అన్నారు. పుల్లయ్య కుమారుడు ప్రవీణ్‌ ఫిర్యాదు పై స్పందించి అయ్యవారిపల్లిలో విచారణ జరుగుతోందన్నారు. లక్ష్మీకాంత్‌రెడ్డి, రామకృష్ణారెడ్డిలపై కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని వివరించారు. రూరల్‌ సీఐ గాంధీనాయక్‌, ఎస్‌ఐ శ్రీకాంత్‌ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

మిడ్జిల్‌: మండల పరిధిలోని చిల్వేర్‌కి చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యమైనట్లు ఏఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు. బుధవారం విషయంపై బాధితులు ఫిర్యాదు చేశారని వివరించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకునేందుకు బారులు



దేవరకద్ర: మండల పరిషత్‌ కార్యాలయం వద్ద గృహజ్యోతి పథకానికి దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. ఇప్పటికీ తమ పేర్లు విద్యుత్‌ రాయితీ, గ్యాస్‌ సిలిండర్‌ పథకంలో లేవని పలువు లబ్ధిదారులు కొత్తగా దరఖాస్తులు ఇస్తున్నారు. వారం రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు బారులు తీరుతున్నారు. బుధవారం ఒకవైపు మహిళలు, మరోవైపు పురుషులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో దరఖాస్తులను తీసుకున్నారు.

ప్రమాణస్వీకారం

జడ్చర్ల టౌన్‌: లయన్స్‌క్లబ్‌ జడ్చర్ల అధ్యక్షుడిగా కైలాస్‌ జవహర్‌తో పాటు నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. బుధవారం ముఖ్య అతిథి లయన్‌ విజయ్‌కుమార్‌ వారితో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యదర్శిగా డా.సుజీత్‌కుమార్‌, కోశాధికారిగా పి. బుచ్చయ్య ప్రమాణస్వీకారం చేయించారు. ప్రోగ్రాం చైర్మన్‌ డా. రాంరెడ్డి, లయన్‌ నటరాజ్‌, శివకుమార్‌, డా.శశికాంత్‌, మృత్యుంజయ, రీజియన్‌ చైర్‌పర్సన్‌ తెప్పశ్రీను, జోన్‌ చైర్‌పర్సన్‌ శివ్వ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.